

# కాగితం పువ్వు

-సూర్యప్రసాదరావు

**యు**వర్ అటెన్షన్ ప్లీజ్! నం... గోల్కొండ ఎక్స్‌ప్రెస్ ఫ్రం సికింద్రాబాద్ టు గుంటూరు యీజ్ ఎక్స్‌పెక్టెడ్ ఇన్ ఎ ఫ్యూ మినిట్స్ ఆన్ ప్లాట్‌ఫామ్ నంబర్ వన్... దయచేసి వినండి... సికింద్రాబాద్ నుండి...

మాటకూ మాటకూ భరించలేని సమయం వదిలిపెట్తున్న ఆ ఎనౌన్స్‌మెంట్ వినిపించడంతో అప్పటిదాకా కాజీపేట స్టేషన్‌లో మండిపోయే ఎండలో వెయిట్ చేస్తున్న మాకు చలివేంద్రం కనిపించినట్లయింది.

అదిగో గురూ! ట్రెయిన్ వచ్చేస్తోంది! మిత్రబృందం హడావిడి చేసేశారు.

బాబ్బాబు... అయితే నాకు కార్నర్ సీటు అట్టిపెట్టండి ముందే రిక్వెస్ట్ చేశాను.

అంటే... హాయిగా కునుకు తీద్దామనా.... ఒకడు ఎద్దేవాగా అన్నాడు.

పోనీలేరా! ఏభైకే డెబ్భై వయసయినట్లు ఫీలవుతున్నాడు... వాడిని ఆ మూలే కూర్చోనీయండిరా ఒకడు మిగిలిన వారిని అనునయించాడు.

ఓకే! కార్నర్ సీట్ శాంక్షన్డ్ ఎద్దేవాగా మాట్లాడిన వాడు అభయం ఇచ్చేశాడు.

ట్రైన్ వచ్చిన తరువాత అంత రష్‌లో కూడా మిత్ర బృందం వాళ్ళ మాట నిలబెట్టుకొని చివరగా ఎక్కిన నాకు కార్నర్ సీటు అట్టిపెట్టటం వారి నిజాయితీకి తార్కాణం!

థాంక్యూ మనస్ఫూర్తిగా అన్నాను.

ఉత్త మాటలతో సరిపోదు. శాంతి చేయాలి సోదరా... శాంతి కావాలి

వాడేం చేస్తాడురా? ఇద్దరాడపిల్లల తండ్రి. పెద్దపిల్లకు పెళ్ళి చేసినవాడు

అవన్నీ అలా ఉండనివ్వండిరా... ముందు దస్తాలు తీయండిరా... దస్తాలు తీయండి

క్షణం వృధా చేయడం వాళ్ళకు ఇష్టంలేదు. గబగబా పేకలు పంచారు. ఆడేవాళ్ళు కొందరు... చూసేవాళ్ళు కొందరు. ఆడించేవాళ్ళు మరికొందరు.

అందరి ముఖాల్లోనూ టెన్షన్!

ఆ టెన్షన్ లేకుండా ఉండడానికే కిటికీకి జారగిలబడి కళ్ళు మూసుకున్నాను.

వెచ్చని వడగాలి చెంపల్ని తాకుతోంది. మధ్యాహ్నం మూడు గంటలు దాటిందేమో... రోహిణీకార్తె కాకపోయినా నలభై రెండు డిగ్రీలకు ఉష్ణోగ్రత తగ్గడంలేదు.

ఎప్పుడో ఉదయం నాలుగు మెతుకులు తిని శాతవాహనలో ఖమ్మం నుండి బయలుదేరడం మొదలు కూర్చోవడమే! ఏక బిగిన నాలుగు గంటలు పేపర్ వాల్యూయేషన్! వంచిన తల ఎత్తకుండా దిద్దితేనే రోజుకు పాతిక పేపర్లు కావడంలేదు. బండిల్ పూర్తిచేసి ఇచ్చేసరికి సమయం రెండు గంటలు. తెచ్చుకున్న టిఫిన్ క్యారియర్ ఖాళీచేసి టైమ్ చూసుకుంటే రెండున్నర! చల్లని మంచి నీళ్ళు జగ్‌లో పట్టుకొని కాజీపేట స్టేషన్‌లో గోల్కొండ కోసం నిరీక్షణ ప్రారంభమౌతుంది.

ఏ క్షణాన ఆరుద్ర నీవు ఎక్కవలసిన రైలు ఓ జీవిత కాలం లేటు అని అన్నాడోగానీ మనం ముందుగా వస్తే రైలుబండి ఎప్పుడూ లేటే! కొద్దిగా లేటుగా వచ్చామో... ఆ రోజు సరిగ్గా సమయానికే వెళ్ళిపోతుంది.

కళ్ళు మూసుకుని మెడ వెనక చెక్కకానించాను. గుంజుతున్న మెడ నరాల బాధ కొంచెం తగ్గినట్లనిపించింది. అందుకే కార్నర్ సీటంటే నాకంత ఇష్టం. ఆ సీటులో మేను వాలిస్తే బోలెడంత రిలీఫ్!

పల్లీ బాబూ! పల్లీ! ఏయించిన పల్లీలు... ఉడకబెట్టిన పల్లీలు... పల్లీ బాబూ

ఏయ్ పల్లీ పిల్లా! వేయించినవి బాగుంటాయా... ఉడకబెట్టినవి బాగుంటాయా!

ఎవడిట్టం ఆడిది బాబూ! ఏయించినవైతే కరకరలాడతయి...

నీలా నేనా! మావాడు జోక్ చేశాడు.

పోండి బాబూ! పల్లీలు తీస్కుంటానంటే ఉంటా... లేకపోతే ఎల్లిపోతా...

మా వాళ్ళు ఒకళ్ళ తరువాత మరొకరు పల్లీలు కొంటూనే చీప్ జోక్స్ వేస్తున్నారు.

నిద్రపట్టకపోవడం వల్ల నాకన్నీ వినిపిస్తూనే ఉన్నాయి.

పల్లీ పిల్ల ఎంత బాగుందో చూడు గురూ! నీ టేస్ట్‌కు తగ్గ ఫిగరు...

కళ్ళు తెరిచి చూతును గదా... కళ్ళ ముందు మెరుపు మెరిసినట్లయింది.

బాపు గీసిన బొమ్మలా ఉంది. వడ్డాది చిత్రించిన చిత్రంలా ఉంది. తీర్చిదిద్దినట్లున్న ముక్కూ మొగం... కళ గల ముఖ వర్చస్సు... ఎక్కడ ఉండాల్సిన బింకాలు అక్కడ ఉన్నాయేమో చూసిన వాడెవడూ కళ్ళు తిప్పుకోలేడు. చిరుగులు పట్టిన జాకెట్... చాలీచాలని ఓణీ...

